


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## వైఎస్ఆర్ కడప

ఆదివారం 31 ఆగస్టు 2025

పేజీలు - 08


## 14 బార్ లైసెన్స్‌లకు

# లాటరీ

### బార్‌లు కేటాయించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

### దరఖాస్తు రూపంలో రూ.12 కోట్లు రాబడి




కడప బ్యూరో - మేజర్‌న్యూస్

నూతన మద్యం పాలసీలో భాగంగా కడప జిల్లాలో 29 బార్ లైసెన్స్ లకు దరఖాస్తులు ఆహ్వానించగా 14 బార్ లకు వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి లైసెన్స్ కేటాయించేందుకు శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి లాటరీ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాలునందు, జిల్లాలో ఓపన్ కేటగిరిలో నోటిఫై చేసిన (27) బార్లల్లో 12 బార్లకు, అదేవిధంగా గీతకులాలకు నోటిఫై చేసిన (2) బార్లల్లో 2 బార్లకు కలెక్టర్ లాటరీ తీసి బార్లు కేటా యించడమైనది. దరఖాస్తు రూపంలో రూ.12 కోట్లు, ప్రాసెసింగ్ ..మిగతా 2వ పేజీలో

## ఊరూరా ఘనంగా వినాయకుడి

# నిమజ్జనం



లోపలి పేజీల్లో..




# యూరియాపై గరం!

## జడ్పీ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

కడప బ్యూరో - మేజర్‌న్యూస్

జిల్లా రైతాంగాన్ని యూరియా కొరత తీవ్రంగా పీడిస్తోంది. ఆర్ఎస్‌కేల్లో ఒక్క బస్తా కూడా అందుబాటులో లేదు. అప్పుడో..ఇప్పుడో అంటూ కాలయాపన చేస్తున్నారు. ప్రైవేటు ఏజన్సీల్లో మాత్రం పుష్కలంగా దొరుకుతోంది. అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారులను నిలదీశారు. యూరియా కొరతపై మండిపడ్డారు. వ్యవసాయశాఖ అధికారులను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. అధికారులు మాత్రం యూరియా కొరత లేదని, రైతులకు అవసరం మేరకు అందుబాటులో ఉందని చెబుతున్నారు. మరోవైపు ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేదని, ప్రభుత్వమే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయాలని సభ్యులు గట్టిగా డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రభుత్వంతో చర్చిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

### జడ్పీటీసీలు ప్రమాణస్వీకారం





కడప, అన్నమయ్య జిల్లాల ఉమ్మడి జడ్పీ సర్వసభ సమావేశం శనివారం చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం 9.45 గంటలకే ప్రారంభిస్తామని జడ్పీ అధికారులు ఎంత హడావుడి చేసినా ఆలస్యంగానే ప్రారంభమైంది. ఈ సర్వసభ్య సమావేశానికి.. వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు, రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పి.రామసుబ్బా రెడ్డి, రామచంద్రా రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, డీసీసీ బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వై.జయప్రకాష్ నారాయణ బాబా, ఖాదీబోర్డు చైర్మన్ కెకె.చౌదరి, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, మిగతా 2పేజీలో

### ఎరువుల కొరత లేదు : కలెక్టర్



యూరియా కొరతపై కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ..జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదని ఖరీఫ్ ప్రారంభంలోనే 12 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేసామన్నారు. సీజన్ అవసరానికి సరిపడా ఇండెంట్ పెట్టడం జరిగిందన్నారు. ఆర్ఎస్‌కేలు, డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉంది. విడతల వారీగా పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. రైతులు ఎటువంటి భయాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు.

- ఆర్ఎస్‌కేల్లో యూరియా బస్తా కూడా అందుబాటులో లేదు
- అధికారులు జిల్లా రైతాంగాన్ని మభ్యపెడుతున్నారు
- ప్రైవేటు ఏజన్సీలు అధిక ధరలతో దోచుకుంటున్నాయి
- కేసీ కెనాల్ పరిధిలో 50 శాతం వరి నాట్లు కూడా పూర్తి కాలేదు
- అప్పుడే యూరియా కొరత అంటే ఎలా : ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరద
- జిల్లాకు ఎంత అవసరమో ప్రణాళిక కూడా లేదా : ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి
- రైతులకు అవసరమైన యూరియా ఉంది.. ఆందోళన వద్దు : కలెక్టర్
- జిల్లాకు ఇప్పటికే 20,500 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది : జేడీ
- ఉల్లికి క్వింటా రూ.2వేలు గిట్టుబాటు ధర కల్పించండి..
- ప్రభుత్వమే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయాలి..
- చినీ పంట ధర కూడా దారుణం.. దళారులు, వ్యాపారులు సిండికేట్
- నూతన జడ్పీటీసీలు ప్రమాణస్వీకారం..

## జూనియర్ కాలేజిలో ‘డ్రగ్స్ వద్దు బ్రో” అవగాహన కార్యక్రమం

వార్త 4వ పేజీలో

## ఫార్మ్ సపోర్ట్ ట్రస్ట్ ఏర్పాటు రైతులకు ఎంతో మేలు

వార్త 4వ పేజీలో..

### ఎరువులు అధిక ధరలకు

## విక్రయిస్తే చర్యలు

### విస్తృతంగా ఏడి విజిలెన్స్ అధికారులు తనిఖీ

వార్త 6వ పేజీలో



# యూరియాపై గరం!

(మొదటి పేజీ తరువాయి)





వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.
అయితే సమావేశం ప్రారంభం కాగానే కొంత మంది సభ్యులు లేచి మూడు మాసాలకు ఒకసారి నిర్వహించే జడ్పీ సమావేశానికి జిల్లా ఉన్నతాధికారులైన కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్ రాకుంటే ఎలా?, సమావేశంలో చర్చించే అంశాలు ప్రభుత్వానికి ఎలా చేరతాయని ప్రశ్నించారు. అయితే జడ్పీ సీఈఓ ఓబుళమ్మ జోక్యం చేసుకుంటూ కలెక్టర్ వస్తారని, కోర్టు వ్యవహారాలపై చర్చిస్తున్నారని సర్దిచెప్పి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరపునాయనిపల్లి, చక్రాయపేట, వేంపల్లి, వేముల, కమలాపురం, పోరుమామిళ్ళ, బ్రహ్మంగారిమఠం, చెన్నూరు, ఖాజీపేట మండలాల్లో యూరియా కొరత తీవ్రంగా ఉందని సభ్యులు అధికారులను నిలదీశారు. మండల స్థాయి అధికారులను అడిగినా సరైన స్పందన లేదన్నారు. ఆర్ఎస్కేల్లో యూరియా స్టాక్ ఉందని అధికారులు మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రైవేటు ఏజన్సీలను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. దీన్ని అవకాశంగా చేసుకుని వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన బస్తా రూ.266 ధరకు కాకుండా రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. తక్షణం జిల్లా రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయాలని కోరారు. దీనిపై వ్యవసాయ శాఖ జేడీ నాయక్ సమాదానం ఇస్తూ.. రైతులు భయపడాల్సిన అవసరం లేదని, జిల్లాకు ఇప్పటికే 20,500 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎవరైనా బ్లాక్‌మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా టాస్క్‌ఫోర్సుకు ఫిర్యాదలు చేయాలన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ కెసి కెనాల్ కింద ఇంకా 50 శాతం వరి నాట్లు కూడా పూర్తి కాలేదని, అప్పుడే యూరియా కొరత ఏర్పడితే ఎలా అంటూ అధికారులను ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ అసలు జిల్లా రైతాంగానికి ఎంత యూరియా అవసరం అనే సమాచారమైనా మీ వద్ద ఉందా? అంటూ నిలదీశారు. జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలంలోనూ యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. ఇప్పటికే అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేదన్నారు. యూరియా కొరతపై సభ్యుల ప్రశ్నలకు వ్యవసాయ శాఖ అధికారులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. జడ్పీ చైర్మన్ రామగోవింద్ రెడ్డి మాట్లాడుతూ ఎకరాకు ప్రభుత్వం అందిస్తున్న 100 కేజీల సబ్సిడీ యూరియా ఏ మాత్రం సరిపోవడం లేదు.. 200 కేజీల యూరియా సరఫరా చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ జోక్యం చేసుకుంటూ డీసీఎంఎస్‌లో సిబ్బంది పనిలేకుండా ఉన్నారని, వ్యవసాయశాఖ రైతులకు అందించే యూరియాను తమద్వారా అందిస్తే ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. దీనికి జేడీ స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకుంటామని, గతంలో డీసీఎంఎస్‌ను పట్టించుకోలేదని ఆరోపించండంతో సభ్యులు జేడీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వైయస్ఆర్ ఆర్బీకే బోర్డులు ఎందుకు మార్చలేదు : ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి**

ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని రైతుల సేవా కేంద్రాలకు, భూసార పరీక్ష కేంద్రానికి ఇప్పటికీ పాత బోర్డుతోనే.. వైఎస్ఆర్ ఆర్బికే ఫెసిలిటేషన్ సెంటర్ అని.. ఉండడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎందుకు అంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మొదట మీ కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రబీ ప్రణాళిక సిద్ధం చేశారా?, ప్రభుత్వానికి ఏమైనా పంపారా? అంటూ జేడీని ప్రశ్నించారు. దీనికి జేడీ సమాదానం ఇస్తూ ఖరీఫ్ సీజనే పూర్తి కాలేదని, జూన్,జూలై మాసాల్లో



లోటు వర్షం పాతం కురిసిందని, ఆగస్టులో మాత్రమే ఆశించిన వర్షపాతం నమోదైందని, ఇంకా కేవలం 20 శాతం ఖరీఫ్ పంటలు మాత్రమే సాగయ్యాయని తెలిపారు. దీనిపై జోక్యం చేసుకున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మరి కరువు మండలాల ప్రతిపాదనలు పంపేందుకు ఏమైనా అవకాశం ఉందా అంటూ ఆరా తీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వరద మాట్లాడుతూ పంటల సాగు, ఎరువుల వాడకం వంటి విషయాల్లో జిల్లా రైతాంగాన్ని ఎవరైనా చైతన్యం చేస్తున్నారా?, రైతుల గురించి అధికారులు పట్టించుకుంటున్నారా? అంటూ నిలదీశారు.

**ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించండి..**

జిల్లాలో ఉల్లి పంట చేతికందిందని, అయితే సరైన గిట్టుబాటు ధర లభించడం లేదని కమలాపురం జడ్పీటీసీ సుమిత్ర సభ దృష్టికి తెచ్చారు. తమ వెంట తెచ్చిన పంటను అధికారులకు చూపించారు. క్వింటా కేవలం రూ.600లకే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని, తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. రైతుల పంటను క్వింటా రూ.1800 నుంచి రూ.2వేలకు ప్రభుత్వమే మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని ఆమె కొరారు. చీని ధర కూడా ఆశించిన మేర రావడం లేదన్నారు. పలువురు సభ్యులు కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ వీరపునాయనిపల్లి, చక్రాయపేట ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఎదురవుతోందన్నారు. దీనిపై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి స్పందిస్తూ ప్రస్తుతం పులివెందుల, అనంతపురం మార్కెట్లలో ధరలను వెంటనే పరిశీలించారు. పులివెందుల మార్కెట్‌లో కొంత మంది దళారులు, వ్యాపారుల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని దీనిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ఉల్లి ధరలపై కలెక్టర్ సమాదానం ఇస్తూ దీనిపై ప్రత్యేక సమావేశం నిర్వహించి మార్కెటింగ్ అధికారులతో చర్చించామని, అవసరమైతే ప్రభుత్వంతో సంప్రదించి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రయత్నిస్తామన్నారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఎల్లటూరు, ఎర్రబల్లె రహదారుల పరిస్థితి సరిగా లేదని, ఆర్అండ్‌బి అధికారులు దృష్టి సారించాలని తెలియజేసారు. చెన్నూరు పట్టణంలో పెండింగ్ లో ఉన్న సర్వీస్ రోడ్డు సమస్యను తీర్చాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం అజెండాలోని పలు శాఖలపై సభ్యులు చర్చ మొక్కుబడిగానే సాగింది. ఈ సమావేశానికి వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

**నూతన జడ్పీటీసీలు ప్రమాణస్వీకారం..**

సమావేశం ప్రారంభం కాగానే ముందుగా.. పులివెందుల, ఒంటిమిట్ట నూతన జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికైన మారెడ్డి లతారెడ్డి, అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు. సీఈఓ ఓబుళమ్మ వారితో ప్రమాణం చేయించారు.

## 14 బార్ లైసెన్స్‌లకు లాటరీ

(మొదటి పేజీ తరువాయి)

ఫీజ్ రూపంలో రూ.6.10 లక్షలు, మొదటి విడత లైసెన్స్ ఫీజ్ రూపంలో రూ.1.19 కోట్లు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ ఖాతాకు జమ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్, అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖరే రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి అధికారి రవికుమార్ పాల్గొన్నారు. కాగా మిగిలిన బార్ లకు మరోసారి నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.

## గరుడ వాహనంపై దర్శనమిచ్చిన శ్రీ రంగనాథుడు



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందుల శ్రీ రంగనాథ స్వామి వారి నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం గరుడ వాహనంపై భక్తులకు శ్రీ రంగనాథుడు దర్శనమిచ్చారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ, నాగపణి శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈరోజు ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, ఆలయ ఈవో కొట్టే వెంకటరమణ, ఉభయ దారులు భక్తులు పాల్గొన్నారు.

## విఘ్నాలను తొలగించి జీవితాల్లో వెలుగులు నింపాలి

### సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** ఆ విఘ్నేశ్వరడు, విఘ్నాలను తొలగించి ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు ఆకాంక్షించారు. శనివారం స్థానిక పుల్లయ్యతోటలో రాచినేని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సర్పంచ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వినాయకుని ఆశీస్సులు పొందారు. అర్చకుడు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీరామనగర్ ప్రాంతంలోని వినాయక విగ్రహాలను ఆయన దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణంలోని నందిక ఆసుపత్రి సమీపంలో ఉన్నవైకాపా నాయకుడు దేవరకొండ చెన్నకేశవులు, లక్ష్మీదేవిల కుమార్తె దేవరకొండ హేమలతను, మండల నిఖిల్ నారాయణల వివాహం జరిగింది. ఈ వివాహ వేడుకలకు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి హాజరు కాలేకపోవడంతో శనివారం ఆయన నివాసానికి వెళ్లి నూతన వధూవరులను నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో పిల్లాపాపలతో వర్ధిల్లాలని ఆయన ఆశీర్వదించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ అంబకపల్లి నారాయణస్వామి, రామచంద్ర కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.0

## బాధ్యతలు స్వీకరించిన రూరల్ సీఐగా నాగభూషణం





**ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్:** ప్రొద్దుటూరు రూరల్ సీఐగా నాగభూషణం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన చట్ట ప్రకారం శిక్షార్హులే అని తెలిపారు. పట్టణ ప్రజలు శాంతి కాముకులుగా మెలగాలని ప్రొద్దుటూరు రూరల్ సీఐ నాగభూషణం సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## చింతకొమ్మదిన్నె స్టేషన్‌కి నూతన ఎస్‌హెచ్‌ఓగా బాలమద్దిలేటి బాధ్యతలు



**చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్:** కడప జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్.పీ) మరియు కర్నూల్ రేంజ్ డీఐజీ ఆదేశాల మేరకు బాలమద్దిలేటి చింతకొమ్మదిన్నె అండర్/గ్రౌండ్ (యూ/జి) పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా శనివారం నాడు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది బాలమద్దిలేటికి హృదయ పూర్వక స్వాగతం తెలిపారు. స్థానికంగా ఈ మార్పు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, శాంతి భద్రతలు పరిరక్షించే దిశగా ఆయన పటిష్ఠంగా పనిచేస్తారని ఆశిస్తున్నారు.

## బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



**పెండ్లిమర్రి, మేజర్‌న్యూస్ :** ప్రముఖ సాహితీవేత్త, చరిత్రకాలు, భాషా పరిశోధకులు 'కళాసరస్వతి' డా.తిరుమల రామచంద్ర కుమార్తె ఆముక్తమాల్యద చెన్నైలో తన నివాసంలోని విలువైన పుస్తకాలను శనివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు, సిబ్బందిలకు అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన విలువైన గ్రంథాల్లో ప్రత్యేకించి తిరుమల రామచంద్ర రచనలు ఉండడం విశేషమన్నారు. వాటిలో బృహదారణ్యకం, మనవి మాటలు, అహంభో అభివాదయే, తిరుమల రామచంద్ర జీవితం–సాహిత్యం, ప్రాకృత వ్మాయంలో రామకథ లాంటి పుస్తకాలున్నాయన్నారు. వీటితోపాటు స్వయంభూ: మరో 11 కథలు, ఇసుక రేణువులు, ఇదిగో లోకానికి ఇది నా లేఖ, శాసనాలు సామాజిక, సాంస్కృతిక, చరిత్ర, పార్వతీ పరిణయం, శ్రీరమణ పుస్తకాలతోపాటు ఆంగ్ల నవలలు, కథలు కూడా ఉన్నాయన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరించిన తిరుమల రామచంద్ర, అనంతలక్ష్మిల కుమార్తె ఆముక్తమాల్యదను యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి, డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు..

# జిల్లా కమిటీలో ముస్లింలకు పెద్దపీట వేయాలి

## నియోజకవర్గ మైనార్టీ నాయకులు తాహిర్ హుస్సేన్

**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా కమిటీలో మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని మైదుకూరు నియోజకవర్గం మైనార్టీ నాయకులు తాహిర్ హుస్సేన్ పేర్కొన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ముస్లిం మైనారిటీల ఓట్లను తెలుగుదేశం పార్టీ (కూటమి) సాధించగలిగింది. 2024 ఎన్నికల్లో ముస్లిం మైనారిటీల ఓట్లు అధికశాతం సాధించిందంటే కేవలం చంద్రబాబు గారిపై నమ్మకంతోనే కూటమి అభ్యర్థులను సైతం అక్కున చేర్చుకున్నారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. దీనిని ధ్రువపరుస్తూ 175 స్థానాలు గాను 164 స్థానాలు గెలవడం, వైసీపీ నిలబెట్టిన ఏడుగురు ముస్లిం మైనార్టీ అభ్యర్థులను ఘోరంగా ఓడిస్తూ తెలుగుదేశం పార్టీ నిలబెట్టిన ముగ్గురు ముస్లిం మైనారిటీ అభ్యర్థులను ఘన విజయాన్ని కట్టబెట్టడమే మరొక ఉదాహరణ. ముస్లిం మైనార్టీలు చంద్రబాబు పై నమ్మకం ఉంచడానికి అదే సమయంలో జగన్ రెడ్డిని నమ్మకపోవడానికి కారణాలు అనేకమైన ఉన్నాయి. ముఖ్యంగా గడచిన పదేళ్లలో అనేక అంశాలను సునిశితంగా గమనించిన ముస్లిం మైనార్టీలు 2024 ఎన్నికల్లో తమ స్పష్టమైన నిర్ణయాన్ని ఫలితాల ద్వారా చెప్పారు. ముస్లిం మైనార్టీలు తెలుగుదేశం పార్టీపై, చంద్రబాబు గారిపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకొని ముస్లిం మైనారిటీల ఓటు షేర్‌ను మరింతగా పెంచుకోవాల్సిన బాధ్యత తెలుగుదేశం పార్టీపై ఉంది. ముస్లిం మైనార్టీలలో చాలా వరకు రాజకీయ చైతన్యమైతే వచ్చింది కానీ రాజకీయ అవకాశాలు మాత్రం అంతంత మాత్రమనే చెప్పాలి. ముస్లిం మైనారిటీలలో వచ్చిన ఈ మార్పును మరింతగా పెంచుకోవాలంటే ముస్లిం మైనార్టీలకు రాజకీయ అవకాశాలు మరింతగా కల్పిస్తూ నాయకత్వాన్ని పెంపొందించాల్సిన బాధ్యత తెలుగుదేశం పార్టీలోని పెద్దలపై ఉంది. ముఖ్యంగా ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్న రాయలసీమ వంటి ప్రాంతాల్లో సరైన ముస్లిం అభ్యర్థులకు తెలుగుదేశం జిల్లా బాధ్యతలు ఇవ్వడం వల్ల రాయలసీమ ప్రాంతాల్లో ఫలితాలపై ఏకపక్షంగా ప్రభావం చూపే మైనారిటీలకు మరింతగా చేరువ అవ్వడమేకాక, రాయలసీమ జిల్లాల ముస్లింలు, 35వేల మంది మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు ఇదే అభిప్రాయాన్ని వెల్లడిస్తూ రాయలసీమ ప్రాంతం పైనే కోటి ఆశలు పెట్టుకునే జగన్ రెడ్డి లాంటి వారికి కనుచూపు మేరలో అవకాశాలే ఉండవని కుండబద్దలు కొట్టినట్టు చెబుతున్నారు. ముస్లిం మైనార్టీలకు ఏవైనా పదవులు కట్టబెట్టాలంటే మైనారిటీ కార్పొరేషన్, హజ్ కమిటీ, వక్ఫ్ బోర్డు లేదా ఉర్దూ అకాడమీలలో మాత్రమే అవకాశాలు కల్పిస్తున్నారు. ఇలా కాకుండా ప్రతి విభాగంలోనూ దామాషా ప్రకారంగా మైనార్టీలకు కూడా అవకాశాలు కల్పించాల్సిన అవసరము ఎంతైనా ఉంది. ఇదే కనుక జరిగితే 80 నుండి 90% మైనార్టీలు తెలుగుదేశం వెంట ఎప్పటికీ నడుస్తారు అనడంలో సందేహం లేదు.



## ఆగ్రో రైతు సేవ కేంద్రంను తనిఖీ




**కలసపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారి మహమ్మద్ రఫీ, వ్యవసాయ శాఖ అధికారి మురళిధర్‌రెడ్డి, పోరుమామిళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ డి శ్రీనివాసులు మండలంలోని కలసపాడులో ఆగ్రో రైతు సేవ కేంద్రంను తనిఖీ చేశారు.. ఎరువులను అధిక ధరలకు అమ్మినచో వారిపై కఠిన చర్య తీసుకుంటామని తెలిపారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని దుకాణ యజమానులను ఆదేశించారు. అలాగే అధిక ధరలకు అమ్మినట్లయితే వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.. రైతులకు నానో యూరియా అందుబాటులో ఉందని, నానో యూరియాను పంటలకు పై పాటుగా పురుగు మందులతో కలిపి పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. అధిక యూరియా పంటలకు వేసి నట్లయితే చీడ పురుగుల ఉధృతి పెరుగుతుందని, దీనివల్ల రైతులు దిగుబడి తగ్గి నష్టపోతారని తెలిపారు.. రైతులెవరు యూరియా కొరత ఉందని ఆందోళన చందనవసరం లేదని రైతు సేవ కేంద్రాలలోనూ, ప్రైవేటు డీలర్ల వద్ద అవసరం మేరకు పంపిణీ చేస్తారని వారు తెలిపారు.

## ట్రాఫిక్ నిభందనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

### వేంపల్లె సీఐ టి.నరసింహులు



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** ట్రాఫిక్ నిభందనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని వేంపల్లె సీఐ టి.నరసింహులు అన్నారు. శనివారం పలు ప్రాంతాల్లో వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో వాహన పత్రాలు, తమ లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరి కలిగి ఉండాలన్నారు. అంతేకాకుండా తల్లిదండ్రులు 18 ఏళ్లు నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. ట్రాఫిక్ నిభందనలు ఉల్లంఘీస్తే జరిమానా, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఉత్తమ ప్రతిభ కనబర్చిన 5 టీమ్‌లకు బహుమతులు

### – మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్ష



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** అమరావతి క్వాంటం వ్యాలీ 2025 హ్యాకథాన్ రాష్ట్రస్థాయి పోటీలకు పంపేందుకు ఇంటర్నల్ హ్యాకథాన్ లో విజేతలైన, ఉత్తమ ప్రతిభ కనబరచిన మొదటి 5 టీమ్ లకు నగదు బహుమతులు, ప్రశంస పత్రాలను ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు 25 టీమ్ లు వందమందికి పైగా విధ్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే భవిష్యత్తు మొత్తం యువత చేసే సాంకేతికతను బట్టి ఉందని, ఇంకా మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తమ తల్లి దండ్రులకు, ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీకీ మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్, పరిశోధన డీన్ రత్నకుమారి, స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్, ఫైనాన్స్ అధికారి రమేష్, పరిక్షల నియంత్రణ అధికారి అరుణ్ కుమార్ రెడ్డి, ఈబీఎస్ కోఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మ్ సపోర్ట్ ట్రస్ట్ ఏర్పాటు రైతులకు ఎంతో మేలు

## ఫార్మ్ సపోర్టు ట్రస్టును ప్రారంభించిన ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి

**పులివెందుల, మేజర్‌న్యూస్:** పులివెందుల మండలం నల్లపురెడ్డి పల్లె గ్రామానికి చెందిన మహేంద్ర, గురునాథ్, గురు, ఆదిత్య, ఉదయ్, నాని, అఖిల్‌లు ఫార్మ్ సపోర్ట్ ట్రస్టును ప్రారంభించారు. ఈ ట్రస్టును శనివారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు ఈ ఫార్మ్ సపోర్ట్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. స్మాల్‌హోల్డర్ రైతులను సామర్థ్యవంతులను చేయడం కోసం సుస్థిర భవిష్యత్తు నిర్మాణం ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పేద, చిన్న రైతులను సుస్థిర వ్యవసాయ సహాయం, వినూత్నత , సామాజిక సమావేశం ద్వారా శక్తివంతులను చేయడం జరుగుతుందన్నారు. వనరులు, శిక్షణ, నకిలీ మార్కెట్ ప్రాప్యతను అందించడం ద్వారా అంచనా రైతు సముదాయాల జీవనోపాధిని మెరుగుపర్చడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ సుస్థిర సాగు విధానాలు , ఉత్తమ సాధనలపై సెషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇన్పుట్ వితరణ ద్వారా అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగు పరికరాలను అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు, రుణాలు , బీమా ప్రాప్యతను సుగమం చేయడం జరుగుతుందన్నారు. వరదలు, పొడి బాటులు వంటి ప్రకృతిలోపల వేగంగా సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు వాతావరణ బద్ధమైన వ్యవసాయం, సహజ వనరుల పరిరక్షణపై అవగాహన పెంపుదల చేయడం జరుగుతుందన్నారు.గంటికి వ్యవసాయ ప్రదర్శన పొలాలు, రైతు వనరుల కేంద్రాలను స్థాపించడం,రైతు ఉత్పత్తిదారుల సంస్థలు సహకారాలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.రైతులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల ప్రాప్యత, న్యాయమైన ధరల విలువను కల్పించడం జరుగుతుందన్నారు. చిన్న రైతులను శక్తివంతంగా చేయడం బలమైన సమాజాలను నిర్మించడంలో మీ భాగస్వామ్యం ఎంత ముఖ్యమో మాతో కలిసి ఉత్తమ భవిష్యత్తును పెంచుకుందామన్నారు. మా లక్ష్యాలకు అనుగుణంగా ట్రస్ట్ నిధులను స్వీకరించడం ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా ప్రారంభమైన నరసింహస్వామి భాద్రపదమాసం పూజలు



**బద్వేల్ మేజర్‌న్యూస్ :** కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం వల్లేరవారి పల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు భాద్రపదమాసం ప్రారంభంతో వైభవంగా అభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది, తదుపరి స్వామి అమ్మ వారు ప్రత్యేక పూల అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు, వీడియో కాల్ ధ్వారా పలువురు,ప్రముఖులు సినిమా యాక్టర్‌లు వీడియో కాల్ ధ్వారా దర్శించుకున్నారు తదుపరి వచ్చిన భక్తులు మాట్లాడుతూ ఆలయంలో స్వామి వారి మూలవిరాట్ చూడటానికి చాలా చూడముచ్చట్టగా ఉంటారు అన్ని అమ్మ వారిని చూస్తూ ఉంటే నవ్వుతారు అన్ని ఆలా నవ్వుతూ ఉన్నపుడు అమ్మ వారిని ఏమైనా కోరిక కోరితే అమ్మ వారి శిరసు నుంచి పుష్పం పడుతుంది ఆలా పడినపుడు మేము కోరుకున్న కోరిక నెరవేరుతుంది అని తెలిపారు, తదుపరి అన్నదాన కైంకర్యం నిర్వహించినవారు, స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# అమృత సముద్రం భగవద్గీత'

### స్వామి తురీయానంద సరస్వతి

**కడప టౌన్, మేజర్ న్యూస్ :** భగవద్గీత అన్ని జ్ఞానాలకు మూలమని, తరగని ఆధ్యాత్మిక నిధియని, అనంతమైన అమృత సముద్రమని కడప చిన్మయ మిషన్ అధ్యక్షులు స్వామి తురీయానంద సరస్వతి అన్నారు. శనివారం పాత కడపలో 'దశమహావిద్వాన్ 'శ్రీ నాగేంద్ర మహెూధర స్వామి ఆశీస్సులతో 'సనా తన ధర్మ సామూహిక ప్రార్ధనా దేవాలయాల సంస్థ' ప్రారంభించారు. ఈ సం దర్భంగా తురీయానంద సరస్వతి సందేశం ఇస్తూ ప్రపంచంలో అన్ని ఆధ్యాత్మిక సాహిత్యాలలో భగవద్గీత తో సమానమైన, స్ఫూర్తిదాయకమైన గ్రంథము మరొ కటి లేదని తెలిపారు.గీతను అనుసరించిన మానవుడు ఉత్తమ జీవన విధానాన్ని అలవర్చుకుంటాడని అన్నారు. సభాధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ రామాయణ,భారత,భాగవతాలు నేటి సమాజానికి ఎంత ఉపయో గకరంగా ఉంటాయో స్పష్ట పరిచారు. ముఖ్య అతిథి మామిళ్ల వెంకటరమ ణయ్య గారి లోకనాథం ప్రసంగిస్తూ నేటి యువత ఉత్తమ జీవన విధానాన్ని అలవర్చుకోవాలంటే రామాయణం కంటే మించిన నీతి శాస్త్రం మరొకటి లేదని చెప్పారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన పసుపులేటి శంకర్ సనాతన ధర్మాన్ని గురిం చి చెబుతూ సనాతనమంటే ముగింపు లేనిదని, ఇది కేవలం మతం కాదని, జీవితాన్ని నడిపించే నియమమని అన్నారు. సంస్థ వ్యవస్థాపకులు కాల్వ సోమ కళానాథరెడ్డి తన ప్రసంగంలో ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించే వారికి ఈ సంస్థ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతోనే ప్రారంభించమ న్నారు.ఆత్మీయ అతిథులు కొవ్వూరు రామసు బ్బారెడ్డి, దేసు వెంకటరెడ్డి, నందా రపు చెన్న కృష్ణారెడ్డి, చెన్నం శెట్టి




శశి కుమార్, బండ్రెడ్డి సతీష్ కుమార్ రెడ్డి, కల్లూరు విజయానంద రెడ్డి, డాక్టర్ కృష్ణ ప్ర సాద్, సనాతన ధర్మ విశిష్టతను చెప్పారు .గౌరవ అతిథులు యడవల్లి భాస్కర్ వర్మ, పట్టురీరు సూర్యనారాయణ, కె ఆర్ కె ఉమామహేశ్వర బాబు, సింగమల వెంకట రమణారెడ్డి, డాక్టర్ జి గురు ప్రసాద్, రంగిశెట్టి కీర్తి కుమార్, బ్రహ్మపురి సురేష్ కుమార్, జెకె కృష్ణ సింగ్, బి జనార్ధన్,గాజుల సుబ్రహ్మణ్యం గార్లు సనాతన ధర్మ సామూహిక ప్రార్ధన దేవాలయాల సంస్థ కార్యాచరణ గురించి తెలియజేశారు. కార్యక్ర ్మంలో వందలాది ఆధ్యాత్మిక చింతనాపరులు, భక్తులు పాల్గొన్నారు.

### నందీశ్వర స్వామి దేవస్థానాన్ని

## నిర్మించడం హర్షణీయం

### డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** మండలంలోని నందిపల్లి గ్రామ ప్రజలు, దాతలు, ప్రభుత్వ సహకారంతో రూ. 3.5 కోట్ల అంచనాలతో సర్వాంగ సుందరంగా నందీశ్వర స్వామి దేవస్థానాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్మిస్తూ ఉన్నారు. ఆ గ్రామ సర్పంచ్, శ్రీనందీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి విజ్ఞప్తి మేరకు ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి శనివారం నిర్మాణ దశలో ఉన్న దేవస్థానాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన, ఆధ్యాత్మికమైన వాతావరణంలో నందిశ్వర స్వామి దేవస్థానం నిర్మాణం అవుతోందని, ప్రత్యేకించి నందిపల్లి గ్రామానికి తగ్గట్టుగా నంది విగ్రహం చూడ ముచ్చటగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు రామాంజనేయరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామగంగిరెడ్డి, రామలింగేశ్వర రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, అమర్, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, రమణ, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కాలేజిలో "డ్రగ్స్ వద్దు బ్రో" అవగాహన కార్యక్రమం



**కడప క్రైమ్, మేజర్‌న్యూస్:** యువతకు భవిష్యత్తుపై కొత్త ఆశలను రేకెత్తిస్తూ, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదంతో, నగరంలోని శంకరాపురం గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాస్తవ పరిస్థితులను వివరించడం ద్వారా విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఈగల్ బృందాలు డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై ఎలా నిఘా ఉంచుతాయో తెలిపారు. అంతేకాకుండా, చట్టంలోని కఠిన శిక్షలు గురించి స్పష్టంగా వివరించారు. డ్రగ్స్ దందాకు పాల్పడిన వారికి ఎలాంటి జైలు శిక్షలు, జరిమానాలు ఎదురవుతాయో తెలిపారు. ఈ కార్యక్రమంలో, కళాశాల అధ్యాపకులు, నార్కోటిక్ సెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు 7216 మందికి పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

### సచివాలయ ఉద్యోగులచే పంపిణీ - ఎంపీడీవో సి. రామకృష్ణ



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని 15 సచివాలయాల పరిధిలో నేడుమంగళవారం 7216 మందికి గాను 3,072 8500 రూపాయలు, మూడు కోట్ల 7 లక్షల 28500 రూపాయలు డబ్బులు మంజూరు అయినట్లు ఎంపీడీవో శనివారం తెలిపారు. పింఛన్ దారులకు సచివాలయ సిబ్బంది సోమవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవోఓ సి.రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. సచివాలయ ఉద్యోగు లకు నగదు విత్ డ్రా చేసి ఇవ్వడంజరిగిందని,సోమవారం ఉదయం7 గంటల నుంచి పించన్దారుల ఇంటి వద్దనే సచివాలయ ఉద్యోగులు పింఛన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఉద్యోగస్తులు అలసత్వం వహిం చరాదని, అలసత్వం వహిస్తే వారి మీద క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరు గుతుందని తెలియజేశారు. మండలంలోని సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.

## సందడిగా కొట్టాలలో వినాయక నిమజ్జనం



**రాజుపాళెం,మేజర్‌న్యూస్:** జిల్లా సరిహద్దులోని కొట్టాల గ్రామంలో శనివారం సాయంత్రం వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు వినాయకుని మండపం వద్ద ప్రత్యేక పూజలు అన్నదానం అనంతరం ఎంతో సందడిగా కూలూరు సమీపంలోని కుందూనది వంతెన పై నుండి నిమజ్జనం చేశారు ఈ నిమజ్జన వేడుకల్లో పెద్ద ఎత్తున ప్రజలు మహిళలు యువకులు పాలుపంచుకున్నారు

# తిరుమలరెడ్డి సేవలు స్థిరస్థాయిగా నిలుస్తాయి

### కంభం తిరుమలరెడ్డిని సత్కరించిన ఎంపీ అవినాష్ రెడ్డి

**పులివెందుల, మేజర్‌న్యూస్ :** మొయిల్ల చెరువుగ్రామ వాస్తవ్యులు కీర్తిశేషులు కంభం తిరుమలరెడ్డి వారి ధర్మపత్ని కీర్తిశేషులు రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం కంభం తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులు (యూఎస్ఏ) వారు శంకర నేత్రాలయము చెన్నై వారి సహకారముతో ఉచిత కంటి వైద్య శిబిరములను గత పది రోజులుగా పట్టణంలోని భాకరాపురం జయమ్మ కాలనీ డాక్టర్ వైయస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ పులివెందులలో ఏర్పాటు చేసి పులివెందుల పట్టణం, పరిసర గ్రామ ప్రజలకు ఉచితముగా కంటి పోరా ఆపరేషన్లు నిర్వహించడము అభినందనీయమని జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి, వైయస్ మనోహర్ రెడ్డిలు అన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా 10 రోజులుగా నిర్వహిస్తున్న కంటి పరీక్షల శిబిరాన్ని జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి వైసిపి నాయ కులతో కలిసి సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ తిరుమలరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పోర పరీక్షలను నిర్వ హించడం చాలా అభినందనీయమన్నారు. ఈ సదవకాశమును పులివెందుల నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని, కంటి పరీక్షలతో పాటు కంటి అద్దాలు మందులు అన్ని ఉచితంగా ఇవ్వడం గొప్ప విశేషం అన్నారు. భవిష్యత్తులో తిరుమలరెడ్డి మరిన్ని సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు. ఈ



కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వార్డు కౌన్సిలర్ రాజశేఖర్, పులివెందుల పట్టిన వైకాపా ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, ఓ.రసూల్, ఇతర వైకాపా నాయకులు మరియు తిరుమల రెడ్డి స్నేహ బృందం, మానవతా సేవ సమితి సభ్యు లు,నేత్రాలయా వైద్య సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ

### డి.సి.టి. ఓ. గీతా వాణి




**పెండ్లిమర్రి మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు విజిలెన్స్ డి సి టి ఓ గీతా వాణి,, వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ సుమంత్ రెడ్డి,, కడప సహాయ వ్యవసాయ ఎస్వీ. సురేష్ కుమార్ రెడ్డి సంయుక్తంగా మండలంలోని వెల్లటూరు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.. ఎరువులను అధిక ధరలకు అమ్మినచో వారిపై కఠిన చర్య తీసుకుంటామని తెలిపారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని దుకాణ యజమానులను ఆదేశించారు. ఇప్పటివరకు యూరియా కొరత రాలేదని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్వి. సురేష్ కుమార్ రెడ్డి గారు తెలిపారు. అలాగే అధిక ధరలకు అమ్మినట్లయితే వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.. రైతులకు నానో యూరియా అందుబాటులో ఉందని, నానో యూరియా ను పంటలకు పై పాటుగా పురుగు మందులతో కలిపి పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. అధిక యూరియా పంటలకు వేసి నట్లయితే చీడ పురుగుల ఉధృతి పెరుగుతుందని, దీనివల్ల రైతులు దిగుబడి తగ్గి నష్టపోతారని తెలిపారు.. రైతులెవరు యూరియా కొరత ఉందని ఆందోళన చందనవసరం లేదని రైతు సేవ కేంద్రాలలోనూ, ప్రైవేటు డీలర్ల వద్ద అవసరం మేరకు పంపిణీ చేస్తారని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో రాగి చెట్టు వేప చెట్టులకు కళ్యాణం

### అన్నదాన కార్యక్రమంలో వైయస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణంలోని స్థానిక గాడి చర్ల వారి వీధిలో వెలసిన రాగి చెట్టు వేప చెట్టు లకు శనివారం కళ్యాణం నిర్వహించారు. ఎడాల సుబ్రహ్మణ్యం దంపతుల, భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణాన్ని అర్చకులు కృష్ణ రాజేష్ శర్మ శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్ లు హాజరై కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం అర్చకులు వారిని శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వినాయకుని మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో వరసిద్ధి వినాయక భక్తమండలి, యువజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో సాగుతున్న గణేశుని నిమజ్జనం




**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** ఈ నెల 27వ తేదీ బుధవారం వినాయక చవితి పండుగను ప్రొద్దుటూరు లో అంగరంగ వైభవంగా నిర్వహించి, వాడవాడలా గణేషుని ప్రతిమలు ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం 3వ రోజు నుంచి బొజ్జ గణపయ్యకు నిమజ్జనాలు ప్రారంభించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శనివారం కూడా ప్రొద్దుటూరు పట్టణ, మండల పరిధిలో నిమజ్జన పర్వం సాగింది. పట్టణ, మండల పరిధిలోని పలు విగ్రహములను గ్రామోత్సవం గా బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాల నడుమ,రంగులు చల్లుకుంటూ ఆనందంగా నిమజ్జనం నిర్వహించారు . కాగా నిమజ్జనం సందర్భంగా కామనూరు బ్రిడ్జ్, అల్లాడుపల్లె కుందూ వద్ద పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు, సహాయక చర్యలు ఏర్పాటు చేశారు.

# ఊరూరా ఘనంగా వినాయకుడి నిమజ్జనం

### శాంతినగర్ కాలనీలో వినాయకుడి లడ్డు రూ. 31 వేలు

**ఎర్రగుంట్ల మేజర్‌న్యూస్ :** వినాయక చవితి పండుగ సందర్భంగా కొలువుదీరిన వినాయకుడి నిమజ్జనం ఉత్సవ ఊరేగింపు ఊరూరా అంగరంగ వైభవంగా జరిగింది ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని శాంతినగర్ కాలనీలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన ఉత్సవ ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వినాయకుడి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జలమునకు ఊరేగింపుగా మంగళ వాయిద్యాలతో తిప్పలూరు గ్రామంలో ఉన్న వంకలోకి తీసుకెళ్లారు అక్కడ నిమజ్జనం నిర్వహించారు. అలాగే ఎర్రగుంట్ల కలమల్ల పరిధిలో కొలువుదీరిన వినాయకుడి విగ్రహాలు నిమజ్జనంనకు తరలించారు

**రూ. 31 వేలు వినాయకుడి లడ్డు**

వినాయకుడి నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా శాంతినగర్ కాలనీలో కొలువుదీరిన వినాయకుడి లడ్డు వేలం పాట నిర్వహించారు .రూ. 31 వేలకు మహేశ్వర్ రెడ్డి, సునీల్ కుమార్ రెడ్డిలు ఇద్దరు అన్నదమ్ములు వేలంలో దక్కించుకున్నారు వేలంపాటలో వినాయకుడి లడ్డును దక్కించుకున్న వారిని



ఊరేగింపుగా లడ్డుతో మంగళ వాయిద్యాలతో డప్పు డప్పులతో లడ్డును తీసుకెళ్లారు.

## ఘనంగా ముగిసిన సప్త శనివార వ్రతాలు



**సింహాద్రిపురం మేజర్‌న్యూస్ :** సింహాద్రిపురం గ్రామంలో కొలువైన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సప్త శనివారాల వ్రతాలు భక్తుల ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా ముందుగా గణపతి పూజ శ్రీ వెంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకం సహస్రనామార్చన తదితర పూజ కై కార్యాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పై పూజా కార్య క్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరి ప్రసాద్ శర్మ పవన్ కుమార్ శర్మ వ్రత పూజ కార్యక్రమం పై వివరిస్తూ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రానున్న వచ్చే శనివారం వడ్డీ కాసుల వారికి విశేష పూజ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ వ్రత పూజా కార్యక్రమంలో బి అనూష. వై అరుణ. బి విజయమ్మ ఎమ్ అనిత, ఎమ్ సరస్వతి,పి వై వర లక్ష్మీ, బి బానోద్ , వి లక్ష్మీ కాంతమ్మ ,పి జి సరోజ , పి పద్మావతి, ఎస్ రాధమ్మ, కె, అంగన్వాడీ సరోజ రాయల సీమ భాగవత భక్త సమాజం మీడియా ఇంచార్జీ యాగంటి బాల కృష్ణా రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టడం తాము సహించం




**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టడం తాము సహించమని టిడిపి కౌన్సిలర్లు, నాయకులు స్పష్టం చేశారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టడం తాము సహించమని, మార్కెట్ కు, గత సంవత్సరం ఎగ్జిబిషన్ కు గత ప్రభుత్వంలో కన్నా అధికంగా టెండర్ వచ్చిందని వివరించారు. గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో ఎగ్జిబిషన్ బకాయిలు వసూలు చేయాలని తెలిపారు. రోడ్డు పై రోడ్డు వేసి మున్సిపల్ సొమ్ము కాజేసిన వైసీపీ వారికే చెల్లుతుందన్నారు. కమిషనర్ వైసీపీ కి అనుకూలంగా లేరనే గురువారం ఛైర్మన్, వైస్ చైర్మెన్లు, వైసీపీ కౌన్సిలర్లు ఆయనపై విమర్శలు చేశారని, కమిషనర్ రవిచంద్రారెడ్డికి అనుభవం లేదనడం వారి అవివేకమని, ఆయన గతంలో 5 మున్సిపల్ కార్పోరేషన్ లలో కమిషనర్ గా విధులు నిర్వహించారని గుర్తించాలన్నారు. అదేవిధంగా వైసీపీ హయాంలో వచ్చిన కమిషనర్లు రాధ, రమణయ్య ఆ పదవికి పూర్తి కొత్త వారని గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్ రెడ్డి, మునీర్,మహమ్మద్ గౌస్, కమాల్ బాష, టిడిపి నాయకులు దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి, నూరీ, పోసా భాస్కర్, జంబాపురం రామాంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైకాపాపై బురద చల్లడమే కూటమి పని

### టూరిజం బోర్డు మాజీ డైరెక్టర్ జయన్న

**కడప క్రైమ్ మేజర్‌న్యూస్ :** విశాఖ నగరంలోని రుషికొండ ప్రాంతంలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన టూరిజం భవనంలో చిన్నపాటి వాల్ సీలింగ్ దెబ్బతినడంతో డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ భూతద్దంలో చూపిస్తూ రాష్ట్ర ప్రజల మెప్పు కోసము దిగజారు రాజకీయం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం బోర్డు మాజీ డైరెక్టర్ లోగిడి జయన్న మండిపడ్డాడు, శనివారం కడప లో ఆయన మీడియాతో మాట్లాడుతూ టూరిజం భవనంలో మరమత్తుల కోసం కోట్ల రూపాయలు ఖర్చువుతుందని అనడం సిగ్గుచేటు రాజకీయమన్నారు, చిన్న అంశాన్ని భూతద్దంలో చూపించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై బురద చల్లే పన్నాగం కూటమి ప్రభుత్వం చేస్తుందని తెలిపారు, ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో దక్కి ప్రజలను మోసం చేశారని విమర్శించారు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో 30 వేల పైచిలుకు మహిళలు అదృశ్యమయ్యారని వారి వివరాలు మొత్తం మా వద్ద ఉన్నాయని మేకపోతు గంభీరం ప్రదర్శించిన పవన్ కళ్యాణ్ అధికారంలో కూర్చోగానే వాటి ఊసే లేదని పేర్కొన్నారు, ఇప్పుడు వారిలో ఎంతమందిని వారి కుటుంబాలకు అప్పగించారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు. వాలంటీర్ మహిళలు నా చెల్లెల్లాంటి వారని వారికి 5 వేలు ఏ మాత్రం సరిపోదని మా కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని మీ అన్నయ్యగా దానిని 10 వేలుగా చేస్తానని ప్రగల్భాలు పలికిన పవన్ కళ్యాణ్ నిరుద్యోగులకు నెలకు 3 వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఎంతవరకు నెరవేర్చారని ఆయనపై మండిపడ్డాడు, కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసి ఏడాది కాలం పూర్తయిన కూడా ఇంతవరకు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక అస్తమానం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పై బురద



చల్లడమే పనిగా పెట్టు కుందని ఆయన విమర్శించారు, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వము రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి పథకాలు అందించే దిశగా పనిచేయాలని ఆయన హితవు పలికారు,

## స్వచ్ఛందంగా ఆలయ పరిసరాలు పరిశుభ్రం

### పాల్గొన్న ప్రణవపీఠశిష్య బృందం



**రాజుపాళెం,మేజర్‌న్యూస్ :** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన వెల్లాలలో శనివారం గుడి-బడి ప్రొద్దుటూరు ప్రణవపీఠ శిష్య బృందం ఆలయాలను స్వచ్ఛందంగా పరిశుభ్రం చేశారు చెత్తాచెదారం ప్లాస్టిక్ బాటిళ్లు ఏరివేసి ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు దేవస్థానానికి సంబంధించిన ఉత్సవ విగ్రహాలు స్వామి వార్ల వాహనాలను పరిశుభ్రం చేశారు శ్రీ చెన్నకేశవ స్వామి ధ్యాన మందిరం శ్రీ, భీమలింగేశ్వర స్వామి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాలను శుభ్రపరిచారు ఆలయం పై భాగాన ఉన్న చెత్తాచెదారాన్ని తీసివేశారు ఈ ప్రణవ పీఠ శిష్య బృందంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని స్వచ్ఛందంగా సేవ కార్యక్రమాలు నిర్వహించారు ఉత్సవ కమిటీ సభ్యులు గంగిరెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి అర్చకులు ఈ సేవ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిని సన్మానం చేసి అభినందనలు తెలిపారు.

## సాంప్రదాయ పద్ధతిలో జానపద కళలను వెలికి తీయాలి



**కలసపాడు మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో సాంప్రదాయ జానపద కళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాముఖ్యత ను ఇవ్వాలని, కళాభిరామ పింఛన్ చైర్మన్ మరియు శిల్ప కళా రత్న అవార్డు గ్రహీత గొల్లపల్లి జయన్న అన్నారు. శనివారం ఆయన శాస్త్రీయ జానపద కళల గురించి మాట్లాడుతూ రాష్ట్రంలో కళాకారు లందరూ వివిధ రంగాలలో తమదైన శైలిలో ప్రజలకు అర్ధ మయ్యే రీతిలో పాటలు తయారుచేసి పాడి ప్రజల మనసును రంజింప చేయుచున్నారు. అలాంటి వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి ప్రభుత్వము నుండి గుర్తింపు కార్డులను ఇవ్వాలని, కళాకారులకు ప్రభుత్వం ఇవ్వవలసిన వాటిని వెంటనే అందించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రు లతో తీసుకున్న పురస్కారాల అవార్డులను హంస అవార్డును, కళా రత్న అవార్డులను పరిగణలోనికి తీసుకొని వారికి ప్రభుత్వము నుండి ఆర్థిక సహాయ వనరులను చేకూర్చాలని తెలిపారు. అలాగే చనిపోయిన వారికి కూడా ప్రభుత్వము నుండి, వారి కుటుంబ పోషణ నిమిత్తం వయస్సుతో సంబంధం లేకుండా పెన్షన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఇల్లు లేని వారికి ఇంటి స్థలం కూడా ఏర్పాటు చేయాలన్నారు.

## పాతూరు బాల వినాయకునికి ఘనంగా నిమజ్జనం



**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామినివాస స్వగృహ నీ కి వెళ్లే దారిలో పాతూరు గ్రామంలో శ్రీ బాల వినాయకుని గత మూడు రోజులుగా విశేష పూజలు అందుకుని బ్రహ్మం సాగర్ లో ఘనంగా నిమజ్జనం చేశారు. శనివారం అశేష జనవాహిని మేళ తాళాల మధ్య డప్పు వాయిద్యాలు బాణాసంచా పేలుస్తూ ఊరేగింపుగా వెళు తూ పిల్లలు పెద్దలు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ఆనం దోత్సవంతో బాల వినాయకుడిని బ్రహ్మం సాగర్ లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పాతూరు గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

### మాజీ ఆప్కాస్ స్టేట్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సన్మానించిన కమిటీ సభ్యులు.



**పోరుమామిళ్ళ మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహం వద్ద మాజీ ఆప్కాస్ స్టేట్ బోర్డు మెంబర్ మరియు పోరుమామిళ్ల డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కళ్యాణ్ చక్రవర్తిని ఆహ్వానించి పూలమాల, శాలువా, మెమెంటో లతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు శాంతి యుతంగా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరూ అష్టైశ్వర్యాలతో ఆయు రారోగ్యాలతో వినాయకుడి ఆశీస్సులతో చల్లగా ఉండాలని కోరారు. పూజా కార్యక్రమం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్య క్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మొదలైన నేత్రదాన పక్షోత్సవాలు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** స్థానిక జిల్లా ఆసుపత్రి లోని కంటి వైద్య విభాగం సమీపంలో శనివారం నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా కడప డిఎంహెచ్ఓ ఆదేశానుసారం కడప డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మాధవిలత ఆధ్వర్యంలో జరిగే ఐ డొనేషన్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూపా నంద్, ఆర్ఎంఓ గోపాల్ ద్వారా ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో డాక్టర్ శాంతి ఆఫ్తాల్మిక్ అధికారులు కె.జె. రఘు రామిరెడ్డి, చంద్ర మౌళి, తేజ, స్టాఫ్ పాల్గొన్నారు.

## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

### విస్తృతంగా ఏడి విజిలెన్స్ అధికారులు తనిఖీ



**రాజుపాళెం,మేజర్‌న్యూస్ :** ఎరువుల అమ్మకం అక్రమ నిల్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులుఎం.కృష్ణమూర్తి విజిలెన్స్ సీఐ బి.శివన్న ఎరువుల దుకాణదారులను హెచ్చరించారు శనివారం మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ రెడ్డితో కలిసి మండల కేంద్రమైన రాజుపాళెం, టంగుటూరు, కొర్రపాడు,వెలవలి గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను తనిఖీ వేశారు దుకాణంలోని ఎరువులకుసంబంధించిన రికార్డులను పరిశీలించారు దుకాణంలో రైతులకు కనబడేటట్లుగా ధరలతో కూడిన స్టాక్ బోర్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు అనుమతులు ఉన్న అన్ని రకాల ఎరువులను ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలన్నారు అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలపై చర్యలు ఉంటాయన్నారు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రైతులకు తప్పనిసరిగా తగిన రసీదులుఇవ్వాలన్నారుయూరియా ఎరువులను రైతులకు అందరికీ అందేలా చూస్తామన్నారు యూరియా కృత్రిమ కొరతను సృష్టించవద్దని హెచ్చరించారు రైతుల అవసరాల మేరకుయూరియా సరఫరా జరుగుతుందన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌తో ఎందరో పేదల ప్రాణాలు కాపాడుదాం

### భూమి రెడ్డి ఉమాదేవి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ



**పులివెందుల మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు పులివెందుల పట్టణంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవి చేతుల మీదుగా నియోజకవర్గంలో దాదాపు 20 మంది లబ్ధిదారులకు Rs. 16,67,281/- రూపాయలు చెక్కులను భూమిరెడ్డి ఉమాదేవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి చొరవతో, సీఎం ఆర్ఎఫ్‌తో నియోజకవర్గంలోని ఎందరో పేదల ప్రాణాలు కాపాడు తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అంది స్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. అనంతరం ఈ సంద ర్భంగా చెక్కులు అందుకున్న లబ్దిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి , శాసనమండలి సభ్యుల భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓ శ్రీనివాసుల రెడ్డి ,తాళ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, ముచ్చుమర్రి మహేష్ పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో భూమిరెడ్డి ఉమాదేవి

### వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణంలోని వినాయక చవితిని పురస్కరించుకొని శనివారం పలు వినాయక స్వామి విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమాలను భక్తులు నిర్వహిస్తూ ఉన్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా పులివెందుల పట్టణంలోని భక్తతులందరూ విరివిగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేస్తూ ఉన్నారు. పులివెందుల పట్టణంలోని హైటెక్ కంప్యూటర్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన వినాయక స్వామి మండపం వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి హాజరయ్యారు ఆమెకు ముందుగా ఘన స్వాగతం పలికి దుశాల్వా గజమాలతో సత్కరించి గణనాథుడికి విశేష పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని కార్యక్రమాలను అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు హైటెక్ కంప్యూటర్ సెంటర్ నిర్వాహకులు రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత ఎముకల లవణ సాంద్రత పరీక్షలు

### ప్రముఖ హోమియో వైద్యనిపుణులు డా.ప్రవీణ్ కుమార్

**కడప టౌన్ మేజర్‌న్యూస్ :** నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురు సందులో ఉన్న పవన్ హోమియో హోమియో క్లినిక్ నందు ఈనెల 31 వ తేదీ ఆదివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 వరకు ఉచిత ఎముకల లవణ సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ హోమియో వైద్యనిపుణులు డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మోకాళ్ళ, తుంటి ఎముకలు అరగడం, పెలుసుగా మారడం వల్ల ఎముకలు విరగడం జరుగుతుందన్నారు.మరికొందరిలో కాల్షియం తక్కువగా ఉంటుందని, విటమిన్ డి లోపం ఉంటుందని చెప్పారు. ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకుంటే వ్యాధి నిర్ధారించబడి, వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తే, ఎముకల సంబంధిత వ్యాధులను పూర్తిగా నివారించవచ్చున్నారు. రూ.1950 లు విలువ చేసే బిఎండి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఆస్టియోఫోరోసిస్ చెకప్ క్యాంపు ను ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఉచిత అపాయింట్మెంట్ కొరకు 9642372990 అనే సెల్ నెంబర్ ను సంప్రదించాలని వారు కోరారు.

# ముద్దనూరులో అంగరంగ వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు

అన్నదానాలు, చెక్కభజనలు, తాళాల భజనలు, భక్తి కార్యక్రమాలు



**ముద్దనూరు మేజర్‌న్యూస్ :** ముద్దనూరు పట్టణంలో అంగరంగ వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు జరిగాయి. పట్టణంలోని దాదాపుగా ప్రతి విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అనేక చోట్ల నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమాలలో వేలాది మందికి అన్నదానాలు చేయడం జరిగింది.పట్టణములో వినాయక విగ్రహాల వద్ద తాళాల భజనలు మారుమోగిపోయాయి. పెద్ద ఎత్తున ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. అనంతరం వినాయక నిమజ్జనం సందర్భంగా పెద్ద ఎత్తున చెక్కభజనలతో వినాయక స్వామికి జేజేలు పలుకుతూ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. స్థానిక పాత బస్టాండ్ కూడలి నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు చెక్కభజన కళాకారులు, భక్తాదు లతో వినాయక చవితి ఉత్సవాలు ముద్దనూరులో అంగరంగ వైభవంగా జరిగాయి. వందలు వేలాదిగా జనం ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు

ఉత్సవాల్లో సందడి చేసిన - గణేష్ పురం ప్రజలు

లడ్డు వేలంలో రూ. 36000



**వల్లూరు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని గణేష్ పురం గ్రామ ప్రజలు వినాయక చవితిని ఘనంగా జరిపారు, మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు, ఊరేగింపు, భక్తి కార్యక్రమాలు గ్రామం మొత్తాన్ని స్పందనాత్మకంగా మార్చాయి, ఈ వేడుకల్లో భాగంగా, గ్రామ ప్రజలు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రతి రోజు ప్రసాదాలు అన్నదానం భక్తులకు అందించారు, చివరి రోజు ఊరేగింపులో వాయిద్యాలు, రంగులు, దేవుడి భజనలు, పాటలు ఎలుగెత్తుతూ అంగరంగ వైభవంగా సాగాయి. అనంతరం, గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేయడం జరిగింది, లడ్డు వేలంలో 36000 పాడి దేవుడి ప్రసాదం గెలుచుకున్న స్థానిక వెంకట సాయి, ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి యూత్ నాయకుడు నిమ్మకాయల శశిధర్ రెడ్డి, నారాయణరెడ్డి, జి సుబ్బారెడ్డి, మురళీధర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, సుబ్బారెడ్డి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 6న రామలింగేశ్వర స్వామి ఆలయ కలశ పున:ప్రతిష్ట



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** సాక్షాత్తు శ్రీరామచంద్ర మూర్తిచే ప్రతిష్టితమైన సైకత లింగం రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో సెప్టెంబర్ 6న సంప్రోక్షణ, కలశ పున:ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ఈఓ శ్రీధర్, పాలకమండలి చైర్మన్ మార్తల రాజారెడ్డి తెలిపారు. శనివారం రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ దాదాపు గత నెల రోజుల క్రితం కోతుల వలన స్వామి వారి ప్రధాన ఆలయ కలశం క్రింద పడడం జరిగిందని తెలిపారు. క్రింద పడిన కలశం కూడా ఆలయంలోని ఈఓ కార్యాలయంలోనే వుందన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 6న ఆలయంలో సంప్రోక్షణ, హెూమాలు, అభిషేకాలు నిర్వహించి, కలశ పున:ప్రతిష్ట జరుపుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# మండలంలో అర్హులైన వికలాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయం

ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజర్ సెక్రెటరీ పి.వి. ఐ.రాజు.ఎంపీడీఓ కు వినతి



**కలసపాడు మేజర్‌న్యూస్ :** కలసపాడు మండలంలోని వివిధ రకాల పెన్షన్ లలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి మహబూబ్ బీ కి ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.వి.ఐ. రాజు శనివారం కలసపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహబూబ్ బీ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పి వీ ఐ రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం లో ఎలాంటి ఇబ్బందులు సర్వే లేకుండా పింఛన్లు ఇచ్చే వారని ప్రస్తుత అధికార పార్టీ టిడిపిలో పెన్షన్ లను తీసి వేయడం సరైన పద్ధతి కాదని ఈ విధంగా సర్వే లేకుండా పెన్షన్లు తీయడం వల్ల అర్హులైన పేదలు తమ కుటుంబ పోషణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని తమ సిబ్బంది ద్వారా పెన్షన్ల మంజూరు చేసేందుకు కృషి చేయాల్సింది పోయి ఉన్న పెన్షన్ లను తీసి వేయడం సరైన పద్ధతి కాదని పేద బడుగు వర్గాల జీవితాలు చాలా ఆగమ్య గోచరంగా తయారవుతాయని ఆయన పేర్కొన్నారు .ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాబట్టి సరైన పద్ధతిలో సర్వే నిర్వహించాలని ఎంపిడిఓ ను కోరడమైనది. అన్ని విధాలుగా సర్వే నిర్వహించి ఎవరికి అన్యాయం జరగకుండా సర్వే నిర్వహిస్తామని,అర్హులైన ఏ ఒక్కరి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

# క్లినిక్ ల్యాబ్‌పై చర్యలు తీసుకోవాలి

రక్త పరీక్షలకు అధికంగా డబ్బులు వసూలు



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** దువ్వూరు మండలం రాంసాయినగర్ గ్రామంలో ఉన్న రక్త పరీక్షల కేంద్రం పై చర్యలు తీసుకోవాలని ప్రాథమిక వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. శనివారం వైద్యాధికారి సురేష్ బాబుకు ఫిర్యాదు చేసినట్లు ఫిర్యాదు దారుడు నాగ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ ఫిర్యాదులో గత రెండు రోజులు క్రితం నా భార్య వరలక్ష్మికి జ్వరం వస్తుండడంతో దువ్వూరు లోని ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు వెళ్లగా, అతను పరీక్షలు నిర్వహించి మాత్రలు ఇంజక్షన్లు వేశారన్నారు.అనంతరం క్లీనిక్ ల్యాబ్ కు రెఫర్ చేయడం జరిగింది. ఆ రక్త పరీక్షల కేంద్రం వారు పరీక్షలు చేసిన తరువాత రిపోర్టుకు 600 రూపాయలు డబ్బులు అడిగారని ఆయన తెలిపారు. తాను డబ్బులు చెల్లించేందుకు బిల్లు రసీదు ఇవ్వమని అడగగా, బిల్లు రసీదు ఇవ్వను, మీరు ఏమి చేసుకుంటారో చేసుకోండి, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని జవాబు ఇచ్చారని తెలిపారు. ఈ విషయంపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్ బాబుకు ఫిర్యాదు చేసి నట్లు నాగ సుబ్బారెడ్డి తెలిపారు. ఫిర్యాదు పై డాక్టర్ సురేష్ బాబు వివరణ తెలపమని అడగగా నాగ సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారని,, అతను ఇచ్చిన అర్జీని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

# లారీ ఢీకొనడంతో భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు



**చింతకొమ్మదిన్నె మేజర్‌న్యూస్ :** చిత్తూరు - కడప జాతీయ రహదారిపై చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని మద్దిమడుగు సుగాలి బిడికి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం ఒక కుటుంబాన్ని విషాదంలో ముంచింది. మేకలు మేపి తిరిగొస్తున్న దంపతులను ఓ ట్రాన్స్‌పోర్ట్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్త బుక్కే నాగేనాయక్ (55) అక్కడికక్కడే మృతిచెందగా, అతని భార్య బుక్కే గోమీలమ్మ (50) తీవ్రంగా గాయపడి రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.స్థానికుల సమాచారం ప్రకారం, గువ్వలచెరువు కొండ వద్ద నుండి మేకలు మేపుకొని ఇంటికి తిరిగి వస్తుండగా, కడప వైపు నుండి వచ్చిన లారీ వేగంగా వచ్చి దంపతులను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో డ్రైవర్ మత్తులో ఉండగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపినట్టు స్థానికులు పేర్కొన్నారు. ఢీకొట్టి పారిపోతున్న లారీని వెనుకగా వస్తున్న ప్రయాణికులు గమనించి వెంటాడి గువ్వలచెరువు సమీపంలో ఆపి, డ్రైవర్‌ను పట్టుకున్నారు.అనంతరం స్థానికులు సమాచారం అందించగా, గాయపడిన దంపతులను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ నాగేనాయక్ మృతి చెందాడు. గోమీలమ్మ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.పోలీసులు సంఘటన స్థలా న్ని పరిశీలించి, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు.

# అట్లూరులో గణేష్ నిమజ్జనాలకు భారీ భద్రత ఏర్పాట్లు

అట్లూరు ఎస్సై రామకృష్ణ



**అట్లూరు, మేజర్‌న్యూస్ :** అట్లూరు మండలం లో వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకులకు మూడు రోజులపాటు పలు గ్రామాలలో ప్రత్యేక పూజలను చేశారు అనంతరం శుక్రవారం నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు గ్రామాలలో మూడు రోజులు పాటు డీజే భక్తి పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను అలరించాయి అనంతరం దారి పొడవునా ప్రజలు వీధులలో టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు పలు వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు గణేష్ నిమజ్జనాలకు వేమలూరు సగిలేరు బ్రిడ్జి సోమశిల బ్యాక్ వాటర్ వద్ద నిమజ్జనం కార్యక్రమాన్ని పోలీసులు ఏర్పాటు చేశారు బద్వేల్ రూరల్ సిఐ కృష్ణయ్య ఆదేశాల మేరకు అట్లూరు ఎస్సై రామకృష్ణ వేమలూరు బ్రిడ్జి వద్ద లైటింగ్, రెస్క్యూ టీం, బోటు, స్విమర్స్ లను నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశారు వేమలూరు బ్రిడ్జి వద్ద నిమజ్జన కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ రెడ్డి, రైటర్ నాగేశ్వర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# డిఎస్సి పొందిన ఉపాధ్యాయుడికి ఘన సత్కారం

- మంచి ర్యాంక్ సాధించడం గర్వకారణం
- కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో సోషియల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బోగ్గల నాగార్జున డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో చిత్తూరు జిల్లా స్థాయి 20వ ర్యాంక్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. దీంతో శనివారం ఆ పాఠశాల ఆవరణంలో కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం కరెస్పాండెంట్ మాట్లాడుతూ తమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఇంత మంచి ర్యాంక్ సాధించడం గర్వకారణమన్నారు. ఇది విధ్యార్థులకు, సిబ్బందికి ఒక గొప్ప ప్రేరణ అన్నారు.ఈ విజయం ఆయన కృషి, పట్టుదల, అంకితభావానికి నిదర్శనంగా నిలిచిందన్నారు.

# కడపలోకదం తొక్కిన ఆశాలు

## ఆశాల భారీ ర్యాలీ వేలాదిగా తరలివచ్చిన ఆశా కార్యకర్తలు




**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** కనీస వేతనం 26,000 ఇవ్వాలని నినదించిన ఆశాలు ఆశాలను పర్మినెంట్ చేయాలి కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి. ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి చేయాలని అఖిలభారత ఆశా వర్కర్ యూనియన్ జాతీయ కార్యదర్శి కే.మల్లిక కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు కడపులో నిర్వహించడం జరిగినది. కడప కోటిరెడ్డి సర్కిల్ నుండి వైయస్సార్ ఆడిటోరియం వరకు భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం రాష్ట్ర అధ్యక్షులు పి సుభాషిణి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా కే మల్లికా పాల్గొని మాట్లాడుతూ 17 సంవత్సరాలుగా గ్రామాలలో పట్టణాలలో గర్భవతులకు బాలింతలకు నవజాత శిశువులకు సేవలు అందిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చైత్ర స్థాయిలో ప్రజలకు చేరవేస్తూ విశేషమైన సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం చాలా దారుణమని అన్నారు ఆశా కార్యకర్తలు చేస్తున్న పనికి తగిన వేతనం ఇవ్వకపోవడం సరైన విధానం కాదని అన్నారు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు సేవలు అందించినటువంటి ఆశా కార్యకర్తలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హెల్త్ లీడర్స్ అని బిరుదు ఇచ్చింది తప్ప వారికి వేతనాలు పెంచాలని కనీస సౌకర్యాలు కల్పించాలని కానీ ప్రభుత్వాలు ఆలోచన చేయకపోవడం చాలా శోచనీయమని అన్నారు కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచుతున్నట్లు ఉద్యోగులుగా గుర్తిస్తున్నట్లు ప్రకటనలు చేస్తుంది తప్ప ఉత్తర్వులు జారీ చేయకపోవడం సరైనది కాదని అన్నారు. ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ గారు మహాసభల ప్రారంభ ఉపన్యాసం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటియుసి చరిత్ర కార్మిక వర్గ పోరాటాలను వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణం ఆశలకు మెరుగైన వేతనాలు పెంచుతామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటనలు చేయడం తప్ప ఒట్టు దండుకున్న తర్వాత ఆశాలను మర్చిపోవడం సరైనది కాదన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఆశా లకుఇచ్చినటువంటి ఉత్తర్వులకు కూడా సరైన విధానం లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఆశా కార్యకర్తలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం వేతనాలు పెంచాలని కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

## "కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైలులు విజిట్."




**కడప, మేజర్‌న్యూస్ :** గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప గౌరవ డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు గౌరవ సెక్రెటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ల ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమును వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, జైళ్లలో బాల నేరస్తులు ఉంటే గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం మొదలగు అంశాలను వివరించారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, వంట గదిని, వసతి గదులను, పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే కమలాపురం మండల న్యాయ సమితిని, జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితిని, ప్రొద్దుటూరు మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైలుల సూపరింటెండెంట్ లు, ఇంచార్జ్ సూపరింటెండెంట్ లు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.




## అనారోగ్యంతో మరణించిన కుటుంబాలను పరామర్శించిన ఎంపి

### ఏ సమస్య తలెత్తిన మేం అండగా ఉంటాం




**లింగాల మేజర్‌న్యూస్ :** లింగాల మండలం లో పట్నూతల గ్రామంలో అనారోగ్యంతో మరణించిన తీరా శివారెడ్డి కుటుంబాన్ని, దిగు పల్లె గ్రామంలోని రోసి రెడ్డి కుటుంబాన్ని శనివారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వారి నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు అధైర్య పడగద్దని వైకాపా పార్టీ ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందని, ఏ సమస్య వచ్చినా మా దృష్టికి తీసుకురావాలని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించే సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చింతకొమ్మదిన్నెలో అక్షర ఆంధ్ర - ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం

**చింతకొమ్మదిన్నె మేజర్‌న్యూస్ :** శుక్రవారం చింతకొమ్మదిన్నె మండల వెలుగు కార్యాలయంలో "అక్షర ఆంధ్ర – ఉల్లాస్ " కార్యక్రమంలో భాగంగా వాలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి ఎంపిడిఓ వెంకట సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, గ్రామాలలోని నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా మార్చే పనిలో వాలంటీర్ టీచర్ల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. అందరూ సమిష్టిగా, నిబద్ధతతో పని చేసి, గ్రామ సమాజంలో విద్యా ప్రబోధానికి తోడ్పడాలని ఆయన సూచించారు.ఈ శిక్షణలో ఏ. పి. యం సి. వి. ఆర్.రాజు , ఏ. పి. ఓ రామాంజుల రెడ్డి , యం. ఈ. ఓ. రమాదేవి , సి. సి.లు, వి. వో.ఏ.లు మరియు వాలంటీర్ టీచర్లు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామపంచాయతీలో అందరికీ అందుబాటులో ఆయుష్మాన్ ఆరోగ్య సేవలు



**కలసపాడు మేజర్‌న్యూస్ :** కలసపాడు మండలంలోని లింగారెడ్డి పల్లె గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర సేవలు ప్రజలందరికీ నిరంతరం అందుబాటులో ఉన్నాయని తెలుగు గంగ నీటి ఆయకట్టు ప్రెసిడెంట్ కొత్తపల్లి చిన్న రంగారెడ్డి అన్నారు. శనివారం సచివాలయ పరిధిలో ఉన్న కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి వచ్చి బిపి, షుగర్, ఆక్సిజన్, ల్యాబ్ అందులో పరికరాలను, పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో షుగర్, బిపి, టైఫాయిడ్, మలేరియా, లాంటి సీజన్ వ్యాధులకు కావలసిన సూదులు, మందులు, అందుబాటులో ఉంచాలని వారు అన్నారు.

## అంజన్నకు ప్రత్యేక పూజలు



**సింహాద్రిపురం మేజర్‌న్యూస్ :** సింహాద్రిపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయాస్తమాన స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, ఆకు పూజ, దళిత పూజ కైకర్యాల అనంతరం ఆంజనేయ స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పండితులు మాట్లాడుతూ మధ్య పురం గ్రామంలో ఎంతో పురాతనమైన ఈ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రతి శనివారం మంగళవారం విశేష పూజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని అందులో భాగంగా శనివారం రోజుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు శ్రీనివాసచార్య భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ సొంత నిధులతో పార్నపల్లె కుడి కాలువ పైప్ లైన్ మరమ్మతులు

### గంగమ్మ కుంట నీటిమట్టాన్ని పరిశీలించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి బోర్లలో నీటిమట్టం పెరగడంతో రైతుల ఆనందం




**లింగాల మేజర్‌న్యూస్ :** లింగాల మండలం అంబకపల్లె గ్రామం సమీపంలో ఉన్న గంగమ్మ కుంట నీటి మట్టాన్ని శనివారం నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాలు పడక బోర్లలో నీటిమట్టం తగ్గిపోవడంతో గ్రామ ప్రజలు ఎంపీ దృష్టికి తీసుకురావడంతో ఆయన తన సొంత నిధులతో పార్నపల్లె కుడి కాలువ పైప్ లైన్ నుండి అంబకపల్లె గంగమ్మకుంటకు పైపులైన్ పనులు చేయించి పైపులైన్ ద్వారా ద్వారా నీటిని గంగమ్మకుంటకు తెప్పించారు. దీంతో గంగమ్మ కుంట నిండుతుండడంతో శనివారం ఆయన గంగమ్మ కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ కుంటకు నీళ్లు రావడంతో రైతులు చాలా ఆనందంగా ఉన్నారన్నారు. బోర్లలో నీటిమట్టం తగ్గిపోయి రైతులు మళ్లీ బోర్లు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొనిందన్నారు. గంగమ్మ కుంట నిండుతుండడంతో బోర్లలో నీటిమట్టం పెరగడంతో రైతుల ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.